94406 62699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21




# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU




అమరావతి సంపుటి : 5 సంచిక : 2, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ ‘రాజధాని’ తొలి తెలుగు వార పత్రిక సోమవారం 28 - ఆదివారం 3 నవంబర్, 2019
Amaravati Volume : 5 Issue : 2, Pages 4, Rate : 2.00 ANDHRA PRADESH CAPITAL’S FIRST TELUGU WEEKLY Monday 28- Sunday 3 November, 2019

వివరాలు 2లో...


‘కంటి వెలుగు’

వివరాలు 3లో...

సౌర విద్యుత్ - వ్యాపార అవకాశం

వివరాలు 4లో...

వెలుగు జిలుగుల దీపావళి

వివరాలు 4లో...

నేషనల్ ఇండస్ట్రీ అకడమియా సమ్మిట్

## గవర్నర్ దీపావళి శుభాకాంక్షలు



**రాజధాని వార్తలు, అమరావతి :** దీపావళి పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ రాష్ట్ర ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ అంటే చెడుపై మంచి గెలుపునకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఈ పర్వదినాన్ని ప్రజలంతా రంగు రంగుల దీపాలను వెలిగించి ఘనంగా జరుపుకొంటారని పేర్కొన్నారు.

## చంద్రగిరి ఆశ్రమం



**రాజధాని వార్తలు హైదరాబాద్ :** ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ గవర్నర్ డా॥ తమిళి సై సుందరరాజన్ ని స్వామి ప్రణవసూదన్ జనతపస్వీ కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు భారత దేశ సంప్రదాయ వైద్యలయిన ఆయుర్వేదం, యునాని, సిద్ధ చికిత్స ప్రాధ్యానతను వివరించారు. అంతేకాకుండా తాను చంద్రగిరి ఆశ్రమం ఆసుపత్రులలో ఉన్న వసతుల గురించి ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. హైదరాబాద్, విశాఖపట్నంతో పాటు వివిధ ప్రదేశాలతో ఈ ఆసుపత్రులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ ఆశ్రమాన్ని స్థాపించిన నవజ్యోతిశ్రీ కరుణాకర్ గురు మతమంటే స్నేహమని, సౌభ్రాత్వతమని, అన్నదమ్ముల వలె జీవించాలని ఆయన మాటలను గుర్తుచేసుకున్నారు.

# గోల్మాల్ గోకులం !

**రాజధాని వార్తలు, డెస్క్ : గోకులం 2 ఆవులకు 1 లక్ష, 4 ఆవులకు 1.5 లక్ష, 6 ఆవులకు 1.8 లక్షల ఎస్టిమేట్స్ తో పశువుల కొట్టాల నిర్మాణానికి దారిద్రరేఖకు దిగువున ఉన్నవారికి కేంద్ర ప్రభుత్వం 90% సబ్సిడీతో ఉపాధిహామీకి ముడిపెట్టి తెచ్చిన పథకం. నాలుగేళ్లు కాలక్షేపం చేసి ఎన్నికల ముందు రైతులపై ఎక్కడలేని ప్రేమ వొలకపోసి ఓట్లు దండుకొని మళ్ళీ అధికారంలోకి రావాలని టీడీపీ వేసిన మాస్టర్ ప్లాన్లో ఒక భాగం. ఒక పక్క ఖజానా కాలీ, కేంద్రం విడుదలచేసిన నిధులు దారి మళ్లింపు, అయినా ఏదోవిధంగా మసిపూసి మారేడుకాయ చేసి, రైతులకు ఒరగబెడుతున్నాను అని ప్రచారం చేసుకొని ఎన్నికలలో లబ్ధి పొందాలనే తాపత్రయం.**

**రాజధాని వార్తలు, డెస్క్ :** అక్టోబర్, 2018 లో కొల్లిపర గ్రామంలో భీమవరపు కిశోర్ రెడ్డికి, 6 పశువుల గోకులం మంజూరు అయ్యినట్టు డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖనుండి తెలుపబడింది. ఆ రైతు వెంటనే ఉపాధిహామీ కార్డు, ఇతర పత్రాలతో పాటు 10% అంటే 18000 రూపాయలు DD ద్వారా పశు సంవర్ధక శాఖకు జమ చేయడం జరిగింది. మార్కెటింగ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా నియమింపబడిన ఇంజనీర్ ప్లాన్, ఎస్టిమేట్ ఇచ్చి రైతుని తొందరగా పూర్తి చేయండి అని వత్తిడి చేయడం జరిగింది. ప్రణాళిక ప్రకారం పని పురోగతినిబట్టి వస్తువుల కొనుగోలు, పని దినాలకు విడివిడిగా బిల్లులు చెల్లించాలి. వాస్తవంలో చూస్తే అధికారులు బిల్లులు చెల్లించకుండా రైతుపై వొత్తిడితెచ్చి, డబ్బు వస్తుంది, కంగారు పడవద్దు, ఎన్నికలకోడ్ వచ్చే ముందే పూర్తి చెయ్యండి అని రైతులతో ఖర్చు పెట్టించి వారిని నిలువునా ముంచారు. ఇలాంటి బలిపశువులు రాష్ట్రంలో కోకొల్లలు.

వందిమాగతులకు మాత్రం పాత షెడ్డులకు రంగులు పూసి, లేని షెడ్డులు ఉన్నట్టు చూపించి మరీ బిల్లులు చెల్లించినట్టు వినికిడి. నిజంగా ఖర్చుపెట్టి పశువుల షెడ్డు నిర్మించుకున్న రైతులు అప్పులపాలై ఉన్న పశువులను కూడా అమ్ముకొని బ్రతువు తెరువుకై రోడ్డున పడ్డ పరిస్థితి. ఈ స్థితికి కారణమైన జన్మ భూమి కమిటీలను, అధికారులను తిట్టని తిట్టు లేదు.


కొత్తగా ఏర్పడ్డ జగన్మోహన్ రెడ్డి గారి ప్రభుత్వం ఈ స్కీం లో జరిగిన స్కాంపై పూర్తి ఆధారాలు ఉన్నాయి కాబట్టే పూర్తిగా ఆపి పశు సంవర్ధక శాఖ, పంచాయతీ రాజ్ శాఖ వారినుండి వివరణ కోరడం జరిగింది. ముఖ్యమంత్రి గారు అవినీతి రహిత పాలన అందిద్దాం, సహకరించండి అని స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా కళ్ళు తెరిచి రాష్ట్ర పెద్దకు సహకరించి ప్రజామోదం పొంది జనరంజక పాలన అందించండి. ఈ గోకులం స్కీం లో టీడీపీ బ్యాచ్ దండుకున్నారు, స్కాం చేసే వారు చేసెసారు, దొరికిందే చాలు అన్నట్టు కొందరు జేబులు నింపుకున్నారు. అమాయక రైతులు, వైసీపీ సానుభూతిపరులు, టార్గెట్ చేసిన కొన్ని కులాలవారు పూర్తిగా ఇరుక్కున్నారు. అధికారులు సహకరించి తొందరగా విచారణ పూర్తి చేసి అమాయకులకు న్యాయం చేయవలసిన ఆవశ్యకత ఉంది. ఇది కేవలం ఒక గ్రామంలో జరిగిన ఉదంతం. ఈ స్కాంపై రాష్ట్రమంతటా సమగ్ర విచారణ జరపవలసి ఉంది.

### సీఎంకు కృతజ్ఞతలు - లక్ష్మీపతి రాజా



**రాజధాని వార్తలు, విజయవాడ :** ఏపీలో వంశపారంపర్య అర్చకత్వానికి ఆమోదం తెలిపి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలుపుకున్నారని బీజేపీ అధికార ప్రతినిధి లక్ష్మీపతి రాజా పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అర్చకుల కుటుంబాల్లో వెలుగు నింపినట్లుయిందని వ్యాఖ్యానించారు. హిందూ ధర్మ పరిరక్షణకు ఈ చర్య ఎంతో ఉపకరిస్తుందని ఆయన వెల్లడించారు. మరోవైపు చంద్రబాబు హయాంలో నిర్ధాక్షిణ్యంగా కూల్చేసిన దేవాలయాలను తిరిగి నిర్మించాలని నిర్ణయించడం సంతోషదాయకమని రాజా అభిప్రాయం వ్యక్తం చేశారు.

### నిత్యం 45 వేల టన్నుల ఇసుక సరఫరా



వార్త 2 లో

### చంద్రబాబు, పవన్ డీఎన్ఏ ఒక్కటే



వార్త 2 లో

# రాజధాని దశ-దిశ

**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి గా గత ప్రభుత్వం ప్రకటించింది. దీని కొరకు పాటుగా స్థానిక రైతుల నుండి దాదాపు 33 వేల ఎకరాల భూమిని భూ సమీకరణ పథకం ద్వారా తీసుకుంది. దీనికి ప్రతిఫలంగా రైతులకు కొంత నివాస సముదాయ ప్లాట్లు, కొంత వాణిజ్య సముదాయ ప్లాట్లను కేటాయించింది. దాంతో పాటుగా ఏటా ఎకరానికి రూ. 50 వేలు (జరిబు భూమికి), రూ. 30 వేలు (మెట్ట భూమికి) కౌలు ఇస్తామని, ప్రతి ఎటా కౌలు చెల్లించింది. అంతే కాకుండా రైతులకు 3 సంవత్సరాలలో అభివృద్ధి పరిచిన ప్లాట్లను ఇస్తామని టీడీపీ ప్రభుత్వం వాగ్దానం చేసింది. అభివృద్ధి పరచిన ప్లాట్లంటే మంచి నీరు, రహదారులు, రోడ్లు, కరెంట్, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తామని మాజీ ముఖ్యమంత్రి నమ్మబలికారు.

**దురదృష్టమేమంటే 5 సంవత్సరాలు ఆయన అధికారంలో ఉండి కూడా ప్లాట్లను అభివృద్ధి చేయలేదు.** కనీసం రోడ్డైనా వేసి ఉంటే రైతులు తమ ప్లాట్లకు వెళ్లి తామే కొంత వరకైనా నిర్మాణాలు చేసుకునేవాళ్ళమని స్థానికులు తెలుపుతున్నారు. దాంతో రాజధాని అమరావతి ప్రాంతాన్ని మార్చుడానికి అవకాశాలు తక్కువగా ఉండేవన్నారు.

ఇక నూతనంగా ఏర్పడిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అయిన తరువాత నుండి ఇప్పటి వరకు రాజధాని అమరావతి గురించి పల్లెత్తు మాటైనా చెప్పలేదు. దీంతో రాజధాని అమరావతి రైతులు రాజధానిని ఇదే ప్రాంతంలో కొనసాగిస్తారా లేక మారుస్తారా లేక అతి దగ్గరలో వేరే చోటికి తరలిస్తారా అనే సందేహాలతో సతమతమౌతున్నారు. ఈ నేపథ్యంలో పలువురు రైతులు స్థానిక ఎమ్మెల్యే డా. ఉండవల్లి శ్రీదేవిని, మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి తమ గోడు వివరించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రాజధాని గురించి ఏర్పాటు చేసిన కమిటీ అధ్యయనం చేసింది. మరోకమిటీ సాంకేతిక వివరాలతో, రాష్ట్రమంతటా పర్యంటించి అన్నీ ప్రాంతాల అభివృద్ధికి, రాజధాని ప్రాంతం దాని అభివృద్ధికి సంబంధించిన నివేదికను మూడు నాలుగు వారాలలో ఇవ్వనున్నదని మున్సిపల్ మంత్రి బొత్స సత్యనారాయణ ఒక పత్రికా సమావేశంలో తెలిపారు. ఆ నివేదిక రాగానే స్పష్టంగా రాష్ట్ర ప్రభుత్వం ఏ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి చేయాలో నిర్ణయం తీసుకొనుందని మంత్రి తెలిపారు.



అయితే ఇప్పటికే పలుమార్లు ప్రస్తుత రాజధాని ప్రాంతంలో నిర్మాణాలకి చాలా ఎక్కువ ఖర్చువుతుందని, మూడు పంటలు పండే భూములను తీసుకొవద్దని శివరామకృష్ణ కమిటీ సూచించిందని మంత్రి తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించే నేషనల్ గ్రీన్ ట్రిబునల్ కృష్ణానదీ పరివహక ప్రాంతాన్ని, కొండవిడు వాగు ప్రవహించే కాలువను మార్చవద్దని, నదీకి పక్కన ఉన్న కరకట్ట కట్టడాన్ని మార్చవద్దని, నదికి దగ్గరలో ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని 2017లో తీర్పు ఇచ్చింది.

అలాగే మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి సైతం ప్రస్తుత రాజధాని ప్రాంతం సరైంది కాదని చెప్తుతున్నారు. రాజధాని నిర్మాణానికి మంగళగిరి ప్రాంతం అనువైందని అక్కడే భవన నిర్మాణాలు చేయడం సులువైందని ఎమ్మెల్యే ఆర్‌కె పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేకాకుండా భూ సేకరణ చట్టం ద్వారా బలవంతంగా రైతుల దగ్గర నుంచి గత ప్రభుత్వం భూములు తీసుకుని ఉంటే తిరిగి వాపస్ ఇచ్చేయాలని ప్రభుత్వానికి లేఖ వ్రాశానని ఎమ్మెల్యే ఆర్‌కె పేర్కొన్నారు. ఉండవల్లి గ్రామం నుంచి నాగార్జునా యూనివర్శిటీ ప్రాంతం వరకు దాదాపు 10 వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిని రాజధాని నిర్మాణానికి ఉపయోగించుకొవచ్చని ఎమ్మెల్యే ఆర్‌కె తెలిపారు. ఇది ఇలా ఉంటే విజయవాడ గుంటూరు రహదారి పక్కన ఉన్న కొన్ని ప్రైవేట్ భూములను, భవనాలను, నాగార్జున యూనివర్శిటీ ప్రాంగణాన్ని, ప్రభుత్వ భూములను ప్రభుత్వం తీసుకొని కొత్తగా రాజధాని నిర్మాణం చేయాలనే ఆలోచన ఉందని స్థానికులు, రాజధాని ప్రాంత రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వం తీసుకున్న రైతుల భూములను, రైతులకు ఇచ్చిన ప్లాట్లను ప్రస్తుత వైస్సార్ సీపీ ప్రభుత్వం ఏం చేయబోతుందో అర్థం కావడంలేదని రైతులు తెలుపుతున్నారు. మరొక రైతు వర్గం గత ప్రభుత్వం నిర్మించిన తాత్కాలిక భవనాలను, ఎమ్మెల్యే, ఐఎఎస్ అధికారుల కొరకు నిర్మించిన భవనాలను వాణిజ్య అవసరాల కొరకు ప్రస్తుత ప్రభుత్వం కేటాయిస్తుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అంతేకాకుండా అప్పటి ప్రతిపక్షనేత జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో రైతుల భూములను తిరిగి రైతులకు ఇచ్చేస్తానని తెలపడంతో భూ సమీకరణలో తీసుకున్న భూములను తిరిగి ఇచ్చేస్తారా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. కొంత మంది రైతులు తిరిగి భూములను తీసుకోవాలనుకుంటున్నారు. దీంతో రాజధాని అమరావతిలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయింది. ఇది ఇలా ఉంటే 2019 సంవత్సరానికి రాజధాని రైతులకు ప్రభుత్వం ఇవ్వవలసిన కౌలు బకాయిలను ఇప్పటికే బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. దీంతో రాజధాని అమరావతి విషయంలో సందీక్తత నెలకొంది.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రాజధాని అమరావతి నిర్మాణం గురించి, స్విస్ ఛాలెంజ్ విధానంపై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆదేసించింది. జాప్యం చేయవద్దని వారించింది. మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పినట్లుగా రాజధాని కొరకు నియమించబడ్డ కమిటీ నివేదిక కొరకు అనేక రంగాల ప్రజలు ఎదురుచూసున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నిర్ణయం కొరకు రాష్ట్ర ప్రజలంతా, ముఖ్యంగా రాజధాని అమరావతి రైతులు ఎదురుచూస్తున్నారు. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధికి, రాజధాని నిర్మాణానికి దశ-దిశా చూపాలని ముఖ్యమంత్రిని కొరుతున్నారు.**


## ఆత్మహత్యలపై చంద్రబాబు ఆవేదన



**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్రంలో ఇసుక కొరత భవన నిర్మాణ కార్మికులకు ఉపాధిని దూరం చేయడమే కాకుండా వారి ప్రాణాలను కూడా హరిస్తోందని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. పండుగ వేళ భవన నిర్మాణ రంగ మేస్త్రీలు బ్రహ్మాజీ, వెంకట్రావుల ఆత్మహత్యలు తనను కలచివేశాయని ట్విట్టర్ లో విచారం వ్యక్తం చేశారు. ఇసుక కొరతతో కార్మికులు పనుల్లేక ఆత్మహత్యలు చేసుకుంటుండడం ఎంతో బాధిస్తోందని, వైసీపీ సర్కారు మాత్రం తమ పార్టీ నేతల జేబులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తోందని మండిపడ్డారు.

అయినా, జీవితం ఎంతో విలువైనదని, సమస్యలకు ఎదురొడ్డి పోరాడేలా తప్ప ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని హితవు పలికారు. బ్రహ్మాజీ, వెంకట్రావుల్లా మరెవరూ తొందరపడి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు టీడీపీ అండగా ఉంటుందని, కార్మికుల కోసం తానున్నానని స్పష్టం చేశారు. ఇసుక అక్రమాలపై వైసీపీ ప్రభుత్వ వైఖరిని నిలదీద్దామంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.



## రాజధాని వార్తలు కలం

# ధర్మసత్రాలు నిర్మించండి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాడి రాజధాని గా అమరావతిని ప్రకటించారు. తాత్కాలిక భవనాలను నిర్మించారు. ఒకప్పుడు ఏదైనా ఊరికి వెళ్లినప్పుడు ఆ ప్రదేశంలో ధర్మసత్రాలు ఉండేవి. వాటిని కొత్వాలు పర్యవిక్షించేవారు. ప్రతి మండల లేక తాలుక లేక జిల్లా ప్రధాన కూడల్లలో ఈ సత్రాలు నిర్మించారు. వాటిని ప్రయాణికుల సౌకర్యార్థం వాడుకునేవాళ్ళు. వీటిని బావుల దగ్గర, మంచి నీటి చెరువుల దగ్గర నిర్మించే వాళ్లు ఎందుకంటే బాటసారులకు మంచి నీరు వసతి ఉండేవి. బ్రిటీషు హాయాంలో వాటి నిర్వహణకు గ్రామ పెద్దలకు అప్పచెప్పేవారు. ఇప్పటికి కూడా వాటి అనావాళ్ళు మన చూడవచ్చు. ఉదాహరణకు కొవ్వూరు భాస్కర్‌రెడ్డి ధర్మసత్రం అత్యంత ప్రజాధరణ గలిగింది. మసీదులకు దగ్గర కూడా ముసాఫిర్ ఖానలు ఉండేవి. వాటిని స్థానికులు ఉపయోగించేవారు.

తిరుమల తిరుపతి మొదటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చెలికాని అన్నారావు ఎండోమెంట్ యాక్ట్‌ను అప్పుడు రాశారు. ఆయన హాయంలోనే తిరుమల తిరుపతి ట్రస్ట్‌ను సెక్యూర్ చేశారు. ఆ రోజుల్లో ప్రయాణికులు చెట్ల క్రింద పడుకునేవాళ్ళు. ఆయన చొరవతో బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ధర్మసత్రాలను ఏర్పాటు చేశారు. దాంతో భక్తులకు సౌకర్యాలు కల్పించగలిగారు. ఇప్పుడు కూడా ధర్మసత్రాలను కాపాడుకోవాలి, కావలసిన చోట నిర్మించాలి.

ముఖ్యంగా రాజధాని అమరావతిలో ధర్మసత్రాలు అవసరం ఉంది. రాష్ట్రం నలుమూలల నుంచి రాజధానికి ప్రజలు వచ్చి తమ సమస్యల కొరకు సచివాలయంలోని వివిధ విభాగాలకు తమ అర్జీలను ఇస్తున్నారు. ఇక్కడే ఉండాలంటే వేల రూపాయలు ఇచ్చి హోటల్‌లలో ఉండలేరు. రోడ్లమీద, ఫుట్‌పాత్‌ల మీద మనం రోజు సచివాలయానికి వచ్చిన ప్రజలు నిద్రించడం చూస్తున్నాము. కాబట్టి సచివాలయానికి దగ్గరలో ధర్మసత్రాలను ఏర్పాటు చేయాలి.

అలాగే రాష్ట్రంలోని ప్రధాన నగరాలలో జిల్లా ముఖ్య కేంద్రాలలో, మండల కేంద్రాలలో ధర్మసత్రాలను ఏర్పాటు చేయమని గౌరవ ముఖ్యమంత్రిని కొరుచున్నాం. ఇది ప్రయాణికులకు అత్యంత ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది.

**బలవంతుడు నాకేమని**
**పలువురతో నిగ్రహించి పలుకుట మేలా**
**బలవంతమైన సర్పము**
**చలిచీమల చేత జిక్కి చావదె సుమతీ!**

# నిత్యం 45 వేల టన్నుల ఇసుక సరఫరా

(మొదటిపేజీ తరువాయి)

**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్రంలో ప్రతిరోజూ 45 వేల టన్నుల ఇసుకను సరఫరా చేస్తున్నట్టు గనులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల ఉపాధి దెబ్బతినకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మైనింగ్ శాఖ కార్యదర్శి రామ్ గోపాల్‌తో కలిసి ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. కృష్ణా, గోదావరి నదుల్లో నెలల తరబడి వరద ప్రవాహం కొనసాగుతుండడం వల్ల ప్రధానమైన రీచ్‌ల నుంచి అనుకున్నంత ఇసుక సరఫరా జరగడం లేదని ప్రభుత్వం దృష్టికి వచ్చిందని చెప్పారు. దీన్ని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఇసుక రీచ్‌లను గుర్తిస్తున్నామని అన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇంకా ఏం చెప్పారంటే... "గత పదేళ్లుగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులకు భిన్నంగా ఈ ఏడాది రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. కృష్ణా నదిలో 70 రోజులుగా, గోదావరిలో 40 రోజులుగా వరద కొనసాగుతుంది. నదుల్లో రీచ్‌లు వరదతో నిండిపోతే ఇసుకను తవ్వితీయడం ఎలా సాధ్యం? దీన్ని కూడా ప్రతిపక్షాలు రాజకీయం చేయడానికి వాడుకోవడం సమంజసం కాదు. రాష్ట్రంలో నూతన ఇసుక పాలసీ ప్రకటించిన తరువాత ప్రారంభంలో 5 వేల టన్నుల ఇసుక సరఫరాకు అవకాశం ఉండగా, దాన్ని ఇప్పుడు 45 వేల టన్నులకు పెంచగలిగాం. వరద ప్రవాహం వల్ల నదులు, వాగుల్లో ఇసుక తవ్వే అవకాశం లేకపోవడం వల్ల ప్రత్యామ్నాయంగా పట్టా భూముల్లో మేట వేసిన ఇసుకను సేకరిస్తున్నాం. ఇందుకోసం టన్నుకు రూ.100 చొప్పున చెల్లిస్తామని భూయజమానులతో ఒప్పందాలు చేసుకుంటున్నాం. ఇప్పటికే 82 మంది పట్టా భూముల యజమానులు ఇసుక తవ్వకాల కోసం ఒప్పందాలు చేసుకున్నారు. 10 పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి కూడా ఇచ్చాం. మరో 15 రోజుల్లో ఇసుక కొరత లేకుండా అడిగిన వారందరికీ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**'క్రెడాయ్'కి 50 వేల టన్నుల ఇసుక అందించాం**

కొత్త ఇసుక పాలసీ అమల్లోకి వచ్చిన తర్వాత గత 30-40 రోజుల్లో ఇసుక కోరుతూ దరఖాస్తు చేసుకున్న వారికి 6 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక సరఫరా చేశాం. రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(క్రెడాయ్) ప్రతినిధులతో మాట్లాడి, వారి అవసరాలకు మరో 50 వేల టన్నుల ఇసుక అందించాం. నిర్మాణ రంగ సంఘాలతో సమావేశాలు నిర్వహించి, వారి అవసరాలు ఎంత, ఏ మేరకు ఇసుకను అందించాలి అనేదానిపై అవగాహనకు వచ్చాం.

**ఆదాయం పోయిందనే అక్కసుతోనే...**

నదుల్లోని ఇసుకను యథేచ్ఛగా దోచుకున్న తెలుగుదేశం పార్టీ నేతలు ఇప్పుడు అధికారం, ఆదాయం పోయిందనే అక్కసుతోనే ఇసుక లభ్యతపై రాజకీయం చేస్తున్నారు. సాధారణంగానే వర్షాకాలంలో భవన నిర్మాణ రంగంలో పనులు నెమ్మదిస్తాయి. నదుల్లోని ఇసుకను టీడీపీ నాయకులు విచ్చలవిడిగా దోచుకున్న ఫలితంగా కృష్ణా నదిలో ఇసుక గోతుల్లో ఓ బోటు మునిగి చాలామంది మరణించారు. ఇసుక దోపిడీపై గ్రీన్ ట్రిబ్యునల్ చంద్రబాబు ప్రభుత్వానికి ఏకంగా రూ.100 కోట్ల జరిమానా కూడా విధించింది. అలాంటి తప్పుడు విధానాలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకం.

**ఎంశాండ్ యూనిట్లకు ప్రోత్సాహం**

రాష్ట్రంలో ఇసుకకు ప్రత్యామ్నాయంగా కంకర నుంచి తయారుచేసే ఎంశాండ్ యూనిట్లకు ప్రోత్సాహాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రస్తుతం ఉన్న మెటల్ క్వారీల్లో ఎంశాండ్ యూనిట్లు నెలకొల్పే వారికి పావలా వడ్డీకి రుణాలు అందించాలన్న ప్రతిపాదనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలిస్తున్నారు" అని మంత్రి వివరించారు.

**భవిష్యత్తులో ఇసుక కొరతే రాదు**

తాజా వరదల కారణంగా నదుల్లో దాదాపు 10 కోట్ల టన్నుల ఇసుక చేరింది. సాధారణంగా రాష్ట్రంలో ఏటా 2 కోట్ల టన్నుల ఇసుక మాత్రమే వినియోగిస్తున్నారు. అంటే మరో ఐదేళ్లకు సరిపడా ఇసుక నిల్వలు రాష్ట్రంలో ఉన్నాయి. రాష్ట్రంలో భవిష్యత్తులో ఇక ఇసుక కొరతే ఉండదు. మరో పదిహేను రోజుల్లో వరదలు తగ్గుముఖం పడతాయని భావిస్తున్నాం. వరద నీరు తగ్గగానే రీచ్‌ల నుంచి కావాల్సినంత ఇసుకను వినియోగదారులకు అందజేస్తాం.

# రాజధానిపై ఇప్పుడు కమిటీయా?

**రాజధాని వార్తలు, అమరావతి :** ప్రధాని శంకుస్థాపన చేసిన నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ రాజధానిని నిర్ణయించేందుకు కమిటీ వేయడం ఏమిటని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు విస్మయం వ్యక్తం చేశారు. పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై ఆయన ట్విటర్‌లో స్పందించారు. 'రాష్ట్రం నడిబొడ్డున, నది ఒడ్డున అందరికీ అందుబాటులో ఉండాలని అమరావతిని రాజధానిగా నిర్ణయించాం. ఇదే జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా దానిని ఆ రోజు స్వాగతించారు. శివరామక ృష్ణన్ కమిటీ చేసిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ.. కమిటీకి వచ్చిన మెయిల్స్‌లో కూడా అమరావతినే అనుకూల ప్రాంతంగా ధ్రువీకరించారు. నాలుగేళ్ల తర్వాత దీనిపై ఇప్పుడు కమిటీ ఏమిటి? హైకోర్టు వద్ద తాగడానికి టీ కూడా లేని పరిస్థితి ఉందన్న వ్యాఖ్యలు మీకు తలవంపులుగా లేవా? వైసీపీ ప్రభుత్వానికి రాజధానిని నిర్మించే సత్తా లేదు. ఆ విషయాన్ని ప్రజల ముందు ఒప్పుకొనే నిజాయితీ కూడా లేదు' అని చంద్రబాబు దుయ్యబట్టారు.

# 'కంటి వెలుగు'

- దృష్టిలోపంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- 'వైఎస్సార్ కంటి వెలుగు' పేరుతో దశలవారీ కంటి పరీక్షలకు శ్రీకారం
- తొలి దశలో 7,04,570 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్ పూర్తి
- 33,391 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు నిర్ధారణ
- నవంబరు 1వ తేదీ నుంచి రెండో దశ కంటి పరీక్షలు..కళ్లద్దాలు అందజేత
- పౌష్టికాహార లేమి, వంశపారంపర్యం, జీవనశైలిలో మార్పులే ప్రధాన కారణాలు




**రాజధాని వార్తలు, కాకినాడ :** విద్యార్థులకు దశల వారీగా కంటి పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు చేసి, కళ్లద్దాలు అందజేసే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ సర్కారు కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు తొలి విడత కంటి పరీక్షలు పూర్తి చేశారు. ఈ పరీక్షల్లో 33,391 మంది విద్యార్థులకు కంటి సంబంధిత సమస్యలున్నట్లు గుర్తించారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి**

ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని మొత్తం 5,998 పాఠశాలల్లో 7,27,609 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ (కంటి పరీక్షలు) టెస్ట్ చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా..5,996 పాఠశాలల్లో 7,04,570 మందికి పరీక్షలు నిర్వహించారు. మిగిలిన కొన్ని పాఠశాలలకు సెలవులు కావడం, గతంలో పరీక్షలకు రాని 23,039 మంది విద్యార్థులకు ఇంకా పరీక్షలు చేయాల్సి ఉంది. స్క్రీనింగ్ టెస్ట్‌లో 97 శాతం పూర్తి చేసి జిల్లా, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సంపాదించింది.

**బృందాల వారీగా..**

ఈ పథకం తొలి విడత అమలు ప్రక్రియ కోసం జిల్లా వ్యాప్తంగా 4,550 బృందాలను నియమించారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా 5,000 కంటి వెలుగు కిట్‌లు అందజేశారు. ఒక ఉపాధ్యాయుడు, ఏఎన్ఎం, ఆశ, కార్యకర్తలను బృందంలో సభ్యులుగా నియమించారు. విద్యార్థుల దృష్టి లోపాలను ఎలా గుర్తించాలనే విషయంపై ఈ బృందాల్లోని సభ్యులకు ముందుగానే శిక్షణ ఇచ్చారు. నేత్ర సమస్యలను గుర్తించేందుకు వీలుగా అందజేసిన కిట్‌లో టార్చిలైట్లు, టేపు, నాలుగు గుర్తులతో కూడిన చార్టులను ఉంచారు. విద్యార్థికి 6 నుంచి 10 అడుగుల దూరంలో చార్ట్‌ను ఉంచి గుర్తులను పోల్చి చెప్పాలని పరీక్ష పెడుతూ దృష్టిలోపం ఉందో లేదో గుర్తించారు. కనుపాప పైపొరలు, దృష్టిలోపం ఉన్న 33,391 మందిని కంటి వెలుగు పథకంలో తొలి విడతలో గుర్తించారు.

**33,391 మందికి దృష్టిలోపం**

స్క్రీనింగ్ పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో 33,391 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. అయితే వీళ్లలో కళ్లజోళ్లతోనే ఎక్కువ మందిలో సమస్య తీరిపోతుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. కొద్ది మందికి శస్త్రచికిత్సలు, ఉన్నత వైద్యం అవసరం కానుంది.

**కారణాలు ఏమిటంటే..**

పిల్లల్లో దృష్టి లోపానికి మేనరిక వివాహాలు, పౌష్టికాహార లేమి, విటమిన్-ఎ లోపం, ఎలక్ట్రానిక్ రేడియేషన్, వంశపారంపర్యం ప్రధాన కారణాలని వైద్యులు ధ్రువీకరించారు. జంక్‌ఫుడ్ అధికంగా తీసుకోవడం, తగిన వ్యాయామం లేకపోవడం, తరగతి గదుల్లో సరైన వెలుతురు లేకపోవడం, బోర్డు నుంచి వచ్చే చాక్‌పీస్ పొడి కళ్లలో పడటం లాంటివి కూడా సమస్యకు దారి తీస్తాయంటున్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలకు ఆటలు, వ్యాయామానికి తగిన సమయం ఇవ్వడం లేదు. ఇరుకు గదుల్లో తగినంత దూరంలో బ్లాక్ బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. తరగతి గదిలో కనీసం దూరంలో బోర్డు ఉండాలి అప్పుడే పిల్లల కంటిపై ఒత్తిడి తగ్గుతుంది. సరైన వెలుతురు ఉండాలి. ప్రభుత్వ పాఠశాలల్లో బోర్డు, వెలుతురు సమస్య అంతగాలేదు. చిన్న వయసు నుంచే ట్యాబ్‌లు, సెల్‌ఫోన్లకు అలవాటుపడి.. గంటల తరబడి చూడటం కూడా దృష్టి లోపాలకు కారణమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

**నవంబర్ 1వ తేదీ నుంచి రెండో దశ**

ప్రాథమిక దశలో నిర్వహించిన పరీక్షల్లో నేత్ర సమస్యలున్నట్లు గుర్తించిన వారికి రెండో దశలో ప్రత్యేక పరీక్షలు చేయనున్నారు. నవంబరు 1వ తేదీ నుంచి రెండో విడత ప్రారంభం కానుండగా కంటి వైద్యుల పర్యవేక్షణలో మరోసారి పరీక్షలు చేస్తారు. పరీక్షించిన వారిలో ఇప్పటికే 7,877 మందికి కళ్లద్దాలు ఉన్నాయి. వారికి అవసరం మేరకు అద్దాలను మార్చడం, అద్దాలు లేని వారికి కొత్తగా కళ్లద్దాలు అందజేస్తారు. శస్త్ర చికిత్సలు అవసరమైతే నేత్ర వైద్యశాలకు తీసుకెళ్లి చేయించనున్నారు. చిన్నారుల్లో కార్నియా సమస్యలే అధికంగా ఉంటున్నాయని, పోషకాహార లోపం జన్యుపరమైన సమస్యలతో ఇబ్బంది పడేవారే ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

**జాగ్రత్తలు పాటిస్తే మేలు**

కంటి సమస్యలను దూరం చేసేందుకు తగిన జాగ్రత్తలు పాటిస్తే ఉపయోగం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు. ప్రతి రోజూ సూర్యరశ్మి తగిలే ప్రదేశంలో ఆటలు అవసరం. విటమిన్-ఎ అధికంగా ఉండే ఆకుకూరలు, క్యారెట్, గుడ్లు, చేపలు తీసుకోవాలి. పసుపు రంగు కలిగిన పండ్లు తినాలి. బొప్పాయి, అరటి, మామిడి, పైనాపిల్, పనస తదితర పండ్లు కళ్లు, మెదడుకు మంచిది.

**100 శాతం అమలు చేస్తాం**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకాన్ని వంద శాతం పూర్తి చేస్తాం. తొలి దశలో ప్రాథమిక పరీక్షల్లో ఆరు మీటర్ల దూరంలో నిర్ణీత పరిమాణం కలిగిన అక్షరాలను పూర్తిగా చెప్పలేపోయిన వారిని గుర్తించాం. విడివిడిగా రెండు కళ్లూ పరీక్షించాం. రెండో దశలో నవంబరు 1వ తేదీ నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు నిపుణులు పరీక్షిస్తారు. ఇందుకు గాను 30 మంది ఆప్తమాలజిస్టులు అవసరమని కోరాం. రెండో దశలో కంటి సమస్యలు గుర్తించిన వారికి అవసరాన్ని బట్టి మందులు, కళ్లజోళ్లు అందజేస్తాం. శుక్లాల సమస్య ఉన్న వారికి శస్త్రచికిత్సలు నిర్వహిస్తారు. ప్రస్తుతం నవోదయ లాంటి కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు అందుబాటులో లేరు. వారికి కూడా నేత్ర పరీక్షలు ఇదే తరహాలో నిర్వహిస్తాం.

# 27 నుంచి విజయవాడకు స్పైస్‌జెట్

**విశాఖ నుంచి బెంగళూరు, చెన్నైకు కూడా సర్వీసులు**

**రాజధాని వార్తలు, మహారాణిపేట (విశాఖదక్షిణ) :** విశాఖపట్నం - విజయవాడ మధ్య విమానాలు నడపడానికి పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. గతంలో విమానాలు నడపడానికి పెద్దగా ఎవరూ ఆసక్తి కనబరచలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత విశాఖ - విజయవాడ మధ్య విమాన సర్వీసులు నడపడానికి అనేక సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి అలెన్స్ ఎయిర్ విమానాలు విశాఖ - విజయవాడ మధ్య నడుపుతోంది. తాజాగా ఈ నెల 27 నుంచి విమానాలు నడపడానికి స్పైస్‌జెట్ కూడా ముందుకు వచ్చింది. నవంబర్ 16 నుంచి విశాఖపట్నం - బెంగళూరు మధ్య విమానాల సర్వీసులు నడపడానికి కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 27 నుంచి విశాఖ నుంచి చెన్నై కూడా విమానాలు నడపడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.



**వారంలో ఆరు రోజులు**

ఈ నెల 27 నుంచి స్పైస్‌జెట్ విశాఖ - విజయవాడ మధ్య విమాన సర్వీసులు నడుపడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వారానికి ఆరు రోజులు నడుపుతారు. మంగళవారం మాత్రం సర్వీసులు ఉండవు. (3254) రోజూ ఉదయం 8.30 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి ఉదయం 9.30 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. అక్కడ(విజయవాడలో 3253లో) ఉదయం 9.50 గంటలకు బయలు దేరి తిరిగి విశాఖపట్నం 10.50 గంటులకు చేరుకుంటుంది.


**విశాఖ - బెంగళూరు మధ్య విమానాలు**

నవంబర్ 16 నుంచి విశాఖపట్నం - బెంగళూరు మధ్య విమాన సర్వీసులు నడపడానికి స్పైస్‌జెట్ సిద్ధమైంది. ఉదయం 11 గంటల 25 నిమిషాలకు బెంగళూరులో బయలు దేరి మధ్యాహ్నం 1.35 గంటలకు విశాఖ చేరుకుంటుంది. మధ్యాహ్నం 1.55 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి సాయంత్రం నాలుగు గంటల అయిదు నిముషాలకు బెంగళూరు చేరుకుంటుంది.

**విశాఖ - చెన్నై మధ్య సర్వీసులు**

విశాఖ - చెన్నై మధ్య విమాన సర్వీసులు ఈ నెల 27 నుంచి నడవనున్నాయి. రోజూ ఉదయం 11 గంటల 20 నిమిషాలకు విశాఖలో బయలుదేరి 12 గంటల 55 నిమిషాలకు చెన్నై చేరుతుంది. ఉదయం 6.35 గంటలకు చెన్నైలో బయలుదేరి ఉదయం 8 గంటల పది నిమిషాలకు విశాఖ చేరుకుంటుంది.

## మంత్రి బొత్సకు టీడీపీ నేతలు లేఖ



**రాజధాని వార్తలు, గుంటూరు :** వైసీపీ మంత్రి బొత్స సత్యనారాయణకు టీడీపీ నేతలు బహిరంగ లేఖ రాశారు. ప్రజారాజధానిపై మీ అబద్దాలకు హద్దులేదా? అని ప్రశ్నించారు. "ఒక సామాజికవర్గం కోసం ముంపు ప్రాంతమంటూ ప్రజా రాజధానిపై రోజుకో నింద వేస్తున్నారు. మీరు కూర్చున్న కొమ్మనే నరుకుతున్నారు. 13 జిల్లాల అభివ ృద్ధికి అవసరమైన నిధులు, ఉద్యోగాలు కల్పించగల రాజధాని ఆంధ్రులకు అవసరం లేదా?. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకు ధీటుగా రాజధాని లేకపోతే ఏపీకి వచ్చి ఎవరు పెట్టుబడులు పెడతారు?" అని టీడీపీ నేతలు లేఖలో పేర్కొన్నారు.

## ఆరుగురికి ఐఏఎస్‌లుగా పదోన్నతి

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ అధికారులతో కూడిన 2018 జాబితాలోని ఆరుగురు ఉన్నతాధికా రులకు ఐఏఎస్‌లుగా పదోన్నత కల్పిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఎస్.భార్గవి, బి.ఆర్. అంబేద్కర్, ఎ.సిరి, జె.వెంకట మురళి, ఎస్.రామసుందర్‌రెడ్డి, వి.వీరబ్రహ్మయ్య ఉన్నారు.

## గుంటూరులో డ్రైనేజ్ పనులు పరిశీలించిన బొత్స




**రాజధాని వార్తలు, గుంటూరు :** మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పశు సంవర్ధక శాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ముస్తఫా, శనివారం గుంటూరు నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ నగరంలోని డ్రైనేజీ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అస్తవ్యస్తంగా పనులు నిర్వహిస్తున్న అధికారులపై ఆయన ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న నగరం గుంటూరు అని, అలాంటి నగర అభివ ృద్ధి పనులలో నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. వర్షం పడితే నగరం దుర్వాసన వస్తోందని, త్వరితగతిన మార్పులు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే నగరంలోని ఇసుక సమస్యపై కూలీలు మంత్రుల దృష్టికి తీసుకెళ్లగా.. త్వరలోనే ఇసుక సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు.

# కుళాయి ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత నీరు


**కొత్త వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఆమోదం**

**రాజధాని వార్తలు, అమరావతి :** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కుళాయిల ద్వారా ప్రతి ఇంటికీ సురక్షితమైన నీటిని సరఫరా చేసేలా రూపొందించిన సరికొత్త వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు నిర్మాణానికి ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 16వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు..రానున్న 30 ఏళ్ల కాలంలో అంటే 2051 సంవత్సరం నాటికి రాష్ట్రంలో పెరిగే జనాభా, పశు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ డ్రింకింగ్ వాటర్ సప్లయి కార్పొరేషన్ ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తుంది. ఏడాది మొత్తం సరఫరాకు అవసరమయ్యే నీరు ఏ ఏ సాగునీటి ప్రాజెక్టులలో అందుబాటులో ఉంటుందన్నది అంచనా వేసి.. ఆయా ప్రాజెక్టుల నుంచి వాటికి సమీపంలో ఉండే ప్రాంతాలకు పైపులైన్ల ద్వారా నీటి తరలించడానికి వీలుగా ప్రాజెక్టు రూపకల్పన ఉంటుంది. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివ ృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులు జారీ చేశారు.



- ఈ ప్రాజెక్టు ద్వారా రోజూ గ్రామీణ ప్రాంతంలో ప్రతి వ్యక్తికి 105 లీటర్లు, పట్టణ, మున్సిపల్ ప్రాంతంలో135 లీటర్లు, నగరాల్లో ఉండే వారికి 150 లీటర్ల చొప్పన నీటి సరఫరా చేస్తారు.
- ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి ఇంటికి మధ్య నీటి సరఫరా సమయంలో 10 శాతానికి మించి నీరు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకుంటారు.
- నిర్ణీత ప్రామాణిక ప్రమాణల మేరకు ఉండే నీటినే సరఫరా చేస్తారు.
- ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే నిధులను ప్రభుత్వ కేటాయింపులకు తోడు ప్రభుత్వ రంగ బ్యాంకులు, నాబార్డు, ఇతర విదేశీ సంస్థల నుంచి రుణాలు తీసుకునేందుకు ఏపీ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రాజెక్టును ప్లబిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ), హైబ్రీడ్ యానిటీ విధానంలో కాంట్రాక్టుకు అప్పగించేందుకు అనుమతి తెలిపింది.

# డిసెంబర్ నాటికి పట్టణాల్లో 70 వేల గృహాలు



**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద మంజూరైన గృహాల్లో నిర్మాణంలో ఉన్న వాటిలో 70 వేల గృహాల నిర్మాణం డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం మున్సిపల్ పరిపాలన, ఏపీటిడ్కో అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అమరావతి సచివాలయంలో పీఎంఏవై పథకంపై అధికారులతో సమీక్షించారు. బ్యాంకు రుణాల కోసం నెలల తరబడి వేచి చూడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, లబ్ధిదారుల వాటా నిధులతో తక్కువ పెట్టుబడితో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఆ ఇళ్లకు అవసరమైన విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఇంటర్నల్ రహదారుల నిర్మాణం, డ్రైనేజి సౌకర్యం తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

## చంద్రబాబు, పవన్ డీఎన్ఏ ఒక్కటే

**రాజధాని వార్తలు, అమరావతి :** టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డీఎన్ఏ ఒకేలా ఉందని, అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఉద్దేశించి ఉదయం చంద్రబాబు ఏం విమర్శలు చేస్తున్నారో.. సాయంత్రానికి పవన్ కూడా అవే విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కుట్రలు, కుతంత్రాలను అధిగమించి పోరాడి వైఎస్సార్‌సీపీని గెలిపించిన ధీరుడు వైఎస్ జగన్ అని, ఆయనను విమర్శించే నైతిక అర్హత పవన్‌కు లేదని అన్నారు. పవన్ బాధ్యతాయుతంగా మాట్లాడాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇటీవల ఢిల్లీ వెళ్లి కేంద్ర హోంమంత్రి అమిషాను కలిసి రాష్ట్ర సమస్యలు వివరిస్తే.. ఆయన సానుకూలంగా స్పందించారని, చేదోడు వాదోడుగా ఉంటామని హామీ ఇచ్చారని రాంబాబు పేర్కొన్నారు.కానీ విపక్ష నేత చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి జగన్‌ను ఉద్దేశించి విమర్శలు చేయడం పూర్తిగా బాధ్యతా రాహిత్యం అని అన్నారు. కేసులు విచారణలో ఉన్నా

కూడా చంద్రబాబు పదే పదే ముఖ్యమంత్రిని నేరస్తుడని అంటున్నారని, పవన్ మరో పక్క వంత పాడుతున్నారని రాంబాబు విమర్శించారు. వైఎస్ జగన్‌పై కేసులు ఎందుకు, ఎలా, ఎప్పుడు పెట్టారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని రాంబాబు చెప్పారు. చంద్రబాబు చీకట్లో చిదంబరం కాళ్లు పట్టుకుని జగన్‌పై కేసులు పెట్టించిన విషయం పవన్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో జగన్ తిరుగులేని రాజకీయవేత్తగా ఎదిగారన్నారు.

## సొమ్ము ప్రజలది..సోకు టీడీపీది: పేర్నినాని



**రాజధాని వార్తలు, అమరావతి :** ప్రజల డబ్బుతో తెలుగుదేశం పార్టీ ధర్మ పోరాట దీక్షలు చేసిందని మంత్రి పేర్నినాని విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజా ధనాన్ని టీడీపీ దుర్వినియోగం చేసిందన్నారు. సొమ్ము ప్రజలది..సోకు టీడీపీదంటూ ఎద్దేవా చేశారు. నాలుగేళ్లు మోదీ భజన చేశారని.. చివరి 8 నెలలు దొంగ దీక్షలు చేసి మోదీని విమర్శించారన్నారు. ఇప్పుడు మోదీకి దూరమై తప్పు చేశామంటున్నారని, మోదీకి దగ్గరవ్వాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మంత్రి పేర్నినాని అన్నారు.

## ప్రత్యేక హోదా ఇవ్వడానికి సాంకేతికంగా వీలుకాదు: కన్నా



**రాజధాని వార్తలు, విజయవాడ :** ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడానికి సాంకేతికంగా వీలుకాదని బీజేపీ నేత కన్నా లక్ష్మీనారాయణ తేల్చిచెప్పారు. హోదా అంశాన్ని రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయని ఆరోపించారు. ఏపీలో 2024 నాటికి బీజేపీనే ప్రత్యామ్నాయమని చెప్పారు. ఎన్నికలప్పుడే రాజకీయం చేద్దామని, రాష్ట్రాభివృద్ధికి అన్ని పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత వల్లే ఇసుక సమస్య వచ్చిందని ఆరోపించారు. నిర్మాణరంగంపై ఆధారపడ్డ కుటుంబాలకు రూ.10 వేలు ఇవ్వాలని కన్నా డిమాండ్ చేశారు.

## పంచాయతీ రాజ్ శాఖలో రివర్స్ టెండరింగ్ సక్సెస్



**రాజధాని వార్తలు, అమరావతి :** అవినీతికి తావు లేకుండా, ప్రజా ధనాన్ని ఆదా చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న రివర్స్ టెండరింగ్ విధానం పూర్తిగా విజయవంతమైంది. పంచాయతీ రాజ్ శాఖలో రివర్స్ టెండరింగ్ విధానంతో గ్రామ సచివాలయ కంప్యూటర్ పరికరాల కొనుగోలులో ప్రజాధనాన్ని ఆదా చేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. డెస్క్‌టాప్ కంప్యూటర్లు, సీపీయూ కొనుగోలులో రూ. 51.15 కోట్లను ఆదా చేశామన్నారు. ప్రింటర్ల కొనుగోలు టెండర్లలో రూ. 14.32 కోట్లను కలిపి మొత్తంగా రూ. 65.47 కోట్లను ఆదా చేసినట్లు ఈ మేరకు అధికారులు ప్రభుత్వానికి తెలిపారు. ఈ డబ్బులతో సంక్షేమ పథకాల అమలు చేపట్టవచ్చన్నారు.

## సీఎం జగన్‌తో ఎమ్మెల్యే వంశీ భేటీ



**రాజధాని వార్తలు, తాడేపల్లి :** ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సమావేశమయ్యారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎం నివాసంలో వంశీ కలిశారు. దాదాపు 30 నిమిషాలపాటు ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా వల్లభనేని వంశీ మాట్లాడుతూ... సీఎం రిలీఫ్ ఫండ్, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన విషయాలు ముఖ్యమంత్రితో చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ భేటీలో వంశీతో పాటు మంత్రులు కొడాలి నాని, పేర్ని నానిలు పాల్గొన్నారు.



**రాజధాని వార్తలు, అమరావతి : మద్య విమోచన ప్రచార కమిటీ చైర్మన్‌గా వి.లక్ష్మణరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ**

# యువశక్తి తోనే దేశాభివృద్ధి

- పారిశ్రామిక, పరిశోధనా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అపారం
- కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి డీవీ సదానంద గౌడ
- సీఎం జగన్ కోరిక మేరకు నాయుడుపేటలో మరో సీపెట్
- ఏపీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- కృష్ణా జిల్లా సూరంపల్లిలో సీపెట్ భవనాన్ని సీఎం వైఎస్ జగన్‌తోకలిసి ప్రారంభించిన కేంద్రమంత్రి
- యువతకు ఉపాధి కల్పనకు 25 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఏకైక రాష్ట్రం ఏపీ

**రాజధాని వార్తలు, అమరావతి :** ప్లాస్టిక్ పరిశ్రమ, పరిశోధన రంగాల్లో అత్యధికంగా ఉన్న ఉపాధి అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి డీవీ సదానందగౌడ పేర్కొన్నారు. యువశక్తిని సద్వినియోగం చేసుకుని దేశాన్ని ప్రపంచంలో అగ్రరాజ్యంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చెప్పారు. 9.30 శాతం వృద్ధి రేటుతో అభివ ృద్ధి చెందుతున్న దేశ ప్లాస్టిక్ పరిశ్రమ విలువ 2025 నాటికి 340 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృష్ణా జిల్లా గన్నవరం మండలం సురంపల్లిలో సంయుక్తంగా నిర్మించిన 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, సెంటర్ స్కిల్లింగ్ అండ్ టెక్నికల్ సపోర్ట్ (సీపెట్–సీఎస్‌టీఎస్) నూతన భవనాన్ని ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలసి ప్రారంభించారు.

అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సీపెట్ పారిశ్రామిక ఆవిష్కరణల ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ రంగంలో పరిశోధనలు, ఉపాధి అవకాశాలను మరింతగా పెంపొందించేందుకు దేశంలో త్వరలో కొత్తగా మరో అయిదు సీపెట్ కేంద్రాలను ప్రారంభించనున్నామని తెలిపారు. ప్లాస్టిక్ కాలుష్య నివారణ దిశగా పరిశోధనలను విస్తృతం చేస్తున్నామన్నారు. ప్లాస్టిక్ రీసైక్లింగ్ పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఈ సవాల్‌ను ఎదుర్కొంటామని చెప్పారు.

**ఏపీ అభివృద్ధికి పూర్తి సహకారం**

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినతి మేరకునెల్లూరు జిల్లా నాయుడుపేటలో మరో 'సీపెట్'ను నెలకొల్పుతామని కేంద్ర మంత్రి సదానందగౌడ ప్రకటించారు. ముఖ్యమంత్రి జగన్ అందించిన సహకారం అభినందనీయమని, ఏపీ అభివ ృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. తాగునీరు, పట్టణాభివృద్ధి, సుందరీకరణ తదితర రంగాల్లో అభివృద్ధికి తమ శాఖ పూర్తిగా సహకరిస్తుందన్నారు.

**యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తాం**



ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందేలా యువతకు నైపుణ్యాభివ ృద్ధిలో శిక్షణ ఇచ్చేందుకు పార్లమెంటు నియోజకవర్గానికి ఒకటి చొప్పున రాష్ట్రంలో 25 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను నెలకొల్పుతామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రాష్ట్ర యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుందన్నారు. దేశంలో మన రాష్ట్రం మాత్రమే పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసిందని చెప్పారు.తగిన శిక్షణ పొందిన యువతను పారిశ్రామికరంగానికి అందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అందుకే యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చే బాధ్యతను తమ ప్రభుత్వం భుజానికెత్తుకుందని వివరించారు. ఇందులో భాగంగా అన్ని పరిశ్రమల్లోనూ ఉపాధి అవకాశాలు దక్కించుకునేలా యువతకు శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రంలో 25 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్ర అభివ ృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కోరారు. రానున్న రోజుల్లో సీపెట్ వంటి మరిన్ని సంస్థలను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతం రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చిన్నతరహా, మధ్యతం ˇహా పరిశ్రమలతో సీపెట్ అనుసంధా నమై ఉపాధి అవకాశాలు పెంపొం దించేందుకు సహకరించాల న్నారు.మచిలీపట్నం ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ వైజాగ్ – కాకినాడ – బందర్ పెట్రో కారిడార్ ఏర్పాటుకు కేంద్రం సహకరించాలని, రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ కార్యదర్శి పి.రాఘవేంద్రరావు, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, మల్లాది విష్ణు, రక్షణ నిధి, మొండితోక జగన్మోహనరావు, కైలే అనిల్ కుమార్, సీపెట్ విజయవాడ డైరెక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సీఎం వైఎస్ జగన్‌తో సదానందగౌడ భేటీ**

సీపెట్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం కేంద్ర ఎరువులు, రసాయన శాఖ మంత్రి డీవీ సదానందగౌడ తాడేపల్లిలోని సీఎం వైఎస్ జగన్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా సీఎం ఆయన్ను మర్యాద పూర్వకంగా తన నివాసంలోకి ఆహ్వానించారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. మధ్యాహ్నం 12.31 గంటలకు వచ్చిన కేంద్ర మంత్రి అక్కడ గంటపాటు గడిపారు. సీఎం ఆతిథ్యం స్వీకరించారు. అంతకు ముందు ఆయన ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.

## రాయపూడిలో పారిశుద్ధ్య పనులు



**రాజధాని వార్తలు, రాయపూడి :** తుళ్ళూరు మండలం రాయపూడి గ్రామంలో ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరిస్తున్నట్లు కార్యదర్శి గాదె వెంకటప్పయ్య తెలిపారు. గ్రామస్తులు చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడవేసి ఇబ్బందులకు గురిచేయకుండా పంచాయతీ సిబ్బంది రిక్షాలు వచ్చినప్పుడు తడిచెత్త, పొడిచెత్త వేరుగా చేసి అందించి సహకరించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం వ్యాధులు విస్తరించే సీజన్ కావడంతో జనావాసాల నడమ చెత్త పడవేయడం ద్వారా దుర్గంధం వెదజల్లి దోమలు పెరిగే ప్రమాదం ఉన్నందున రిక్షాల్లో ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించే కార్యక్రమం ముమ్మరంగా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## మంత్రి అవంతి ఇంటిని ముట్టడించిన జనసేన నేతలు



**రాజధాని వార్తలు, విశాఖ :** మంత్రి అవంతి శ్రీనివాస్ ఇంటిని జనసేన నేతలు, భవన నిర్మాణ కార్మికులతో కలిసి ముట్టడించారు. తమకు ఉపాధి కల్పించాలని, ఇసుకను అందుబాటులోకి తేవాలని భవన నిర్మాణ కార్మికులు అవంతి ఇంటి వద్ద నినాదాలు చేశారు. మంత్రికి తమ కష్టాలను కార్మికులు వివరించారు. ఈ సందర్భంగా అవంతి మాట్లాడుతూ... ఇసుక మీద కొన్ని రాజకీయ పార్టీలు అనవసరంగా రాజకీయాల లబ్ధికి వాడుకుంటున్నారన్నారు. వీలైనంత త్వరలో ఇసుకను అందుబాటులోకి తెస్తామన్నారు.

## వి.ఐ.టి.-ఏ.పి. విశ్వ విద్యాలయంలో జాతీయ స్థాయి RACSPA సదస్సు.

**రాజధాని వార్తలు, అమరావతి :** వి.ఐ.టి.-ఏ.పి. విశ్వ విద్యాలయంలో ది.21 మరియు 22 వ తేదిలలో స్కూల్ అఫ్ కంప్యూటర్ సైన్సు అండ్ ఇంజనీరింగ్ (SCOPE) అధ్వర్యంలో "ఇటీవలి కాలంలో కంప్యూటర్ ఆధారిత వ్యవస్థల్లో ప్రగతి, ప్రక్రియలు, అప్లికేషన్స్ (RACSPA)" గురించి జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించారు. ఈ రెండు రోజుల సదస్సులో 5 కీనోట్లు, 23 పరిశోధనా పత్రాలను ఎంపిక చేసారు. వీటిలో ఎంపిక చేసిన వాటిని Taylor and Francis Proceedingలో, మిగతా వాటిని Scopus Journal లలో ప్రచురిస్తారు.

ఈ సదస్సులో భాగంగా మొదటి రోజు డా॥ ఎస్. శ్రీనివాస్ కుమార్, వైస్ ఛాన్సలర్ , JNTU Anantapuram, డా॥గణపతి పాండా, ఐ.ఐ.టి. భువనేశ్వర్, మరియు డా॥ Bhansidhar Majhi, ఐ.ఐ.టి.డి.ఎం. కాంచీపురం పాల్గొన్నారు. డా॥గణపతి పాండా మాట్లాడుతూ ఇంటలిజెన్స్ సిస్టమ్స్, మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్ లో సాధించిన ప్రగతి గురించి వివరించారు. డా॥ ఎస్.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ కంప్యూటర్ గ్రాఫిక్స్, ఇమేజ్ ప్రాసెసింగ్, ఇమేజ్ సెగ్మెంటేషన్, బ్లయిండ్ ఇమేజ్ ప్రాసెసింగ్ గురించి చక్కగా వివరించారు.




డా॥ Bhansidhar Majhi మాట్లాడుతూ మెడికల్ ఇమేజ్ ప్రాసెసింగ్, ప్రీ-ప్రాసెసింగ్, సెగ్మెంట్ టెక్నిక్స్, Pathology detection using Images గురించి వివరించారు. రెండవ రోజు డా॥ డి.పి. కొఠారి, మాజీ వైస్ ఛాన్సలర్, వి.ఐ.టి. మాట్లాడుతూ కంప్యూటర్ సైన్సు అండ్ ఇంజనీరింగ్ లోని అనేక పరిశోధనాత్మక రంగాల గురించి, ఐ.ఓ.టి. మరియు సమాజంతో టెక్నాలజీ సమ్మిళితం గురించి వివరించారు.

డా॥ sTT. శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్, ANU, మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్ మరియు మనవ మనుగడలో మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్స్ యొక్క పాత్ర గురించి వివరించారు.

ఈ సదస్సులో డా॥ డి. శుభాకర్, వైస్ ఛాన్సలర్, వి.ఐ.టి.-ఏ.పి, డా॥ హరి సీత,డీన్ (Scope), డా॥ అనుపమ, డా॥ సౌభాగ్య శంకర్, ఫాకల్టీ, పరిశోధన విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# సౌర విద్యుత్ - వ్యాపార అవకాశం

**సౌర విద్యుత్ ని పండిద్దాం-విద్యుత్ సమస్యలకు స్వస్తి చెబుదాం**

**రాజధాని వార్తలు, ఇంటర్‌నెట్ డెస్క్ :** విద్యుత్ మన దైనందిన జీవితాలలో చాలా ముడిపడివుంటుంది. విద్యుత్ అంతరాయం ఏర్పడితే నివాసాలు, వాణిజ్య సంస్థలు, స్కూళ్ళు, కాలేజీలు, వ్యవసాయదారులు వగైరా వివిధ వర్గాల కష్టాలు వర్ణనాతీతం. బొగ్గు కార్మికుల సమ్మె, మునుపటి ప్రభుత్వం స్వాప్ పద్ధతిలో తీసుకున్న విద్యుత్ తిరిగిచెల్లించటం, మునుపటి ప్రభుత్వం చేసిన అధిక అప్పుల వల్ల పవర్ ఎక్స్చేంజిలో స్వల్పకాలిక నిషేధం, తదితర కారణాల వల్ల రాష్ట్రంలో ఇటీవల విద్యుత్ సరఫరా కొరత ఏర్పడి వివిధ వర్గాల రోజువారీ విద్యుత్ సరఫరాకు కొన్ని అంతరాయాలు ఏర్పడ్డాయి.

రాష్ట్రంలో అన్ని వర్గాల రోజువారీ విద్యుత్ అవసరాలను తీర్చడానికి నిరంతరం అవసరమయ్యే విద్యుత్‌ని అందుబాటులో పెట్టుకునేందుకు చెయ్యాల్సిన దీర్ఘకాలిక పరిష్కారాల గురించి మనం ఆలోచించి, ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలలో అవలంబిస్తున్న అధునాతన సాంకేతికతను నూతన పద్దతులను విధివిధానాలను దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా అందిపుచ్చుకొని స్వావలంబన దిశగా మనం ముందుకెళ్లి నిరంతరం మనకు అవసరం అయ్యే విద్యుత్‌ని మనమే తయారు చేసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పరుగులు పెట్టించాల్సిన బాధ్యత హక్కు మనకు ఉంది.

**ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సరఫరా అధికంగా ఉండేలా చేసేందుకు దీర్ఘకాలిక పరిష్కారాలు ఇవిగో...**

ప్రభుత్వం సాంప్రదాయ విద్యుత్ వనరులైన హైడ్రోపవర్, థర్మల్ పవర్‌లను వాడుకుంటూ పునరుత్పాదక సహజ శక్తి (Renewable Natural Energy) ఉత్పత్తులను పెంచడం పై దృష్టి సారించింది. ఇది శుభపరిణామం. అలాగే అభివృద్ధి చెందిన దేశాలు ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా పాటిస్తున్న కొన్ని అధునాతన పద్ధతులను అవలంబించడం మన రాష్ట్ర శ్రేయస్సు దృష్ట్యా చాలా అవసరం.

**1. భారీ స్థాయిలో చిన్న చిన్న సౌర వ్యవసాయ కేంద్రాల ద్వారా సౌర విద్యుత్ ఉత్పతి& చేయుట**

"సౌర వ్యవసాయం"ని మరింతగా ( ప్రతి 5 లక్షల జనాభాకు కనీసం ఒకటి) ప్రొత్సహిస్తే, అది మన విద్యుత్ కేంద్రాలకు అదనపు విద్యుత్ వనరుగా అధిక మొత్తంలో విద్యుత్ అందుబాటులో ఉండేలాగా సహకరిస్తుంది.

సౌర వ్యవసాయం తెలుగు రాష్ట్రాలకు కొత్త విధానం ఏమీ కాదు. మునుపటి ప్రభుత్వం సౌర వ్యవసాయం కొరకు టెండర్లకు పిలుపునిచ్చి ఆ అవకాశాన్ని పెద్ద పారిశ్రామిక వర్గాలకు అధిక ధరలతో ఎక్కువ సంవత్సరాలకు కట్టబెట్టింది.

**ఉదాహరణ :** 5 నుండి 6 ఎకరాల భూమిలో 1 మెగా వాట్ల సౌర వ్యవసాయం చెయ్యడానికి సౌర ప్యానెల్లు (పలకలు), ఇన్వర్టర్లు,మౌంటు నిర్మాణాలు, సివిల్ మరియు భూ అభివృద్ధి పనులు, భూమి ఖర్చు (చౌకైనది మరియు విద్యుత్ ఉప స్టేషన్ సమీపంలో ఉండే భూమి అయితే విద్యుత్ ట్రాన్స్మిషన్ వ్యయాన్ని తగ్గించడానికి ఉపయోగపడుతుంది), ఎలక్ట్రికల్ & ట్రాన్స్మిషన్ ఖర్చులు మొదలైనవి మొత్తం కలిపి 7 నుండి 10 కోట్లు వరకు ప్రాజెక్టు నిర్మాణ వ్యయం అవుతుంది. అలాంటి ప్రతి చిన్న సౌర వ్యవసాయం కేంద్రం 12 నుండి 15 మందికి ఉపాధి కల్పిస్తుంది.

**ప్రాజెక్ట్ పరిమాణం, ఎన్ని మెగా వాట్లు (యండబ్ల్యూ) విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం మీద ఆధారపడి వ్యాపార నమూనా (బిజినెస్ మోడల్)** : కాంట్రాక్టులో అంగీకరించిన విధంగా ప్రభుత్వం అధికారాన్ని కొనుగోలు చేస్తుంది మరియు చెల్లిస్తుంది. పెట్టుబడి పై రాబడి (రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్మెంట్) 3 నుంచి 4 సంవత్సరాల తర్వాత లాభాలు మొదలవుతాయి.

చిన్న ఔత్సాహిక పారిశ్రామికులకు (ప్రతి 5 లక్షల జనాభాకు 1సోలార్ ఫామ్) ప్రభుత్వం సౌర వ్యవసాయాన్ని ప్రోత్సహించగలిగితే మరియు భూమిని అందించగలిగితే, ఎంఎస్ఎంఇ (యం.ఎస్.యం.ఈ) కార్యక్రమంలో భాగంగా ప్రవాస భారతీయులు, ఇండియాలో ఉండే తెలుగు వారిలో ఔత్సాహిక పారిశ్రామికులు కూడా చాలా ఆసక్తిగా ముందుకొచ్చి పెట్టుబడులు పెట్టే అవకాశం పుష్కలంగా ఉండడంతోపాటు, విద్యుత్ రంగంలో భారీ మూలధన పెట్టుబడులు (క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్స్) రాష్ట్రానికి వస్తాయి. దీంతో రాష్ట్రంలో విద్యుత్ లభ్యత పెరుగుతుంది, యువతకు ఉద్యోగాలు కూడా బాగా కల్పించినవాళ్లమవుతాము.

ప్రభుత్వ నామినేటెడ్ టెండర్లలో బడుగు బలహీన వర్గాలకు మైనారిటీలకు 50% రిజర్వేషన్ కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం చేసిన కొత్త చట్టంను అందిపుచ్చుకొని ఒక్కొక్కరు కానీ లేదా ఐదారుగురు స్నేహితులు బృందాలుగా ఏర్పడి, సౌర వ్యవసాయం వైపు అడుగుపెట్టే బడుగు బలహీన వర్గాలు, మైనారిటీ వర్గాల ఔత్సాహిక పారిశ్రామికులు ప్రభుత్వం ఆయా కార్పొరేషన్ ద్వారా వారికి అందిస్తున్న నిధులను, సబ్సిడీ, రుణాలను కూడా అందిపుచ్చుకొని పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతారు. తద్వారా బడుగు బలహీన వర్గాల వాళ్ళను కూడా వ్యాపారంరంగంలో, పారిశ్రామికరంగంలో ప్రొత్సాహించాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కల కూడా ఒక్కొక్కరు కానీ లేదా ఐదారుగురు స్నేహితులు బృందాలుగా ఏర్పడి సౌర వ్యవసాయం ను మిగతా 50% జనరల్ విభాగంలో కాంట్రాక్టులు పొందవచ్చు.

భారతదేశంలో రెన్యూవబుల్ ఎనర్జీ అభివృద్ధి కోసం ప్రపంచ బ్యాంక్, నాబార్డ్, పవర ఫైనాన్స్ కార్ప్, ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎల్ఆర్ఈడిఏ) నుండి లభించే నిధులను సౌర వ్యవసాయం కోసం కొనే పరికరాలకు రాయితీగా అందించడంలో సహాయపడతాయి! ఇలా అనేక మంది చిన్న మధ్య స్థాయి (ఎంఎస్ఎంఇ) పారిశ్రామికులని తయారు చేసి భారీ ఎత్తున యువతకు ఉద్యోగాలు కల్పించి సౌర విద్యుత్‌ని సృష్టించి మన రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చుకోవచ్చు.

**2) రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున స్వీయ సౌర విద్యుత్ ఉత్పత్తి**

ఆసక్తి గత వ్యక్తుల ఇళ్ల పైకప్పులపై సౌర ఫలకలను ఏర్పాటు చేస్తారు. ఉత్పత్తి చేయబడిన సౌర విద్యుత్తు సమీప విద్యుత్ గ్రిడ్ (ఉప స్టేషన్)కు ప్రసారం చేయబడుతుంది, ఇది విద్యుత్ పంపిణీని నిల్వ చేస్తుంది, నిర్వహిస్తుంది.

ప్రభుత్వం పవర్ గ్రిడ్లను నిర్వహించగలదు లేదా అమెరికాలో చేసే విధంగా ప్రైవేట్ కాంట్రాక్టులకు అవుట్సోర్స్ చేయవచ్చు.



ప్రతి ఇల్లు అవసరమైన విద్యుత్ని విద్యుత్ గ్రిడ్ (ఉప స్టేషన్) నుంచి ఉపయోగించుకుంటుంది. ప్రతి ఇల్లు ఉత్పత్తి చేసిన సరఫరా చేసే విద్యుత్, విద్యుత్ గ్రిడ్ (ఉప స్టేషన్) నుంచి వాడుకున్న విద్యుత్ ఆధారంగా విద్యుత్ పంపిణీ సంస్థ ప్రతి ఇంటిని బిల్ చేస్తుంది.

అమెరికాలోని చాలా కౌంటీలలో (కౌంటీ అంటే మనకు మునిసిపాలిటీలు లాగ) ప్రతి ఇంటికి మూడు మీటర్లు ఉంటాయి. మొదటి మీటర్ సంబంధిత ఇంటి నుంచి ఉత్పత్తి చేసి పవర్ గ్రిడ్‌కు సరఫరా చేయబడిన విద్యుత్తు నమోదు చేస్తుంది. రెండవ మీటరు పవర్ గ్రిడ్ నుండి సంబంధిత ఇంటికి తీసుకొనివచ్చి వినియోగించుకున్న విద్యుత్తు నమోదు చేస్తుంది. మూడవ మీటర్లో రెండింటికి తేడా ఉంటుంది. కొన్ని కౌంటీలలో విద్యుత్ వినియోగం, ఉత్పత్తి గణాంకాలను ఒకటే మీటర్ చూసుకుంటుంది.

అమెరికా లాంటి దేశాలలో గృహాల కోసం కొనుగోలు చేసే సోలార్ ప్యానెల్ తదితర సామాగ్రికి సంబంధిత కౌంటీ, సంబంధిత రాష్ట్రం రాయితీలు ఇచ్చి ప్రోత్సాహిస్తాయి. భారతదేశంలో రెన్యూవబుల్ ఎనర్జీ అభివృద్ధి కోసం ప్రపంచ బ్యాంక్, నాబార్డ్, పవర్ ఫైనాన్స్ కార్ప్, ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎల్ఆర్ఈడిఏ) నుండి లభించే రాష్ట్ర వాటా నిధులను ప్రతి ఇంటికి కొనుగోలు చేసే సోలార్ ప్యానెల్ తదితర సామాగ్రికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీగా అందించి ప్రోత్సహిస్తే ఎక్కువ మంది సౌర విద్యుత్ సృష్టించేందుకు ఆసక్తిచూపుతారు.

**3. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రతి ఆసక్తిగల వ్యక్తి తన ఇంట్లో స్వీయ సౌర విద్యుత్ ని ఉత్పత్తి చేసి ఇన్వెర్టర్‌లో భద్రపరుచుకొని వాడుకోవడం**

పై సెక్షన్ 2 భాగంలో వివరించిన పరిష్కారంతో పాటు, ప్రతి ఆసక్తిగల వ్యక్తి తన ఇంట్లో స్వీయ సౌర విద్యుత్‌ని ఉత్పత్తి చేసి ఇన్వెర్టర్‌లో బ్యాకప్ పరికరాలను "టెస్లా వాల్" మొదలైన బ్యాటరీలను ఉపయోగించి భద్రపరుచుకొని వాడుకోవడం ద్వారా విద్యుత్ ప్రజలకు అందుబాటులో ఉంటుంది. మనం కూడా అభివృద్ధి చెందిన దేశాల లాగ శాస్వితంగా విద్యుత్ సమస్యలకు చరమగీతం పాడేయవచ్చు.

**– మునిశేఖర్ దువ్వూరు,**
**సాఫ్ట్ వేర్ ఇంజినీర్, అమెరికా**
**– చంద్రా రెడ్డి కొప్పర్తి**

# వెలుగు జిలుగుల దీపావళి

**భా**రతీయ సంస్కృతికి ప్రతిబింబం, చీకటిని పారతోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా దీపావళి పండుగను జరుపుకుంటారు. ప్రతియేటా ఆశ్వయుజ అమావాస్య రోజున వస్తుంది. దీపాల పండుగకు ముందు రోజు ఆశ్వయుజ బహుళ చతుర్ధశి. దీన్ని నరక చతుర్ధశిగా జరుపుకుంటారు.

**దీపాలంకరణ మరియు లక్ష్మీ పూజ**

**దీపం జ్యోతిః పరంబ్రహ్మ దీపం సర్వతమోపహమ్**
**దీపేన సాధ్యతే సర్వమ్ సంధ్యా దీప నమ్మోస్తుతే**

దీపజ్యోతిని పరబ్రహ్మ స్వరూపంగా, మనోవికాసానికి, ఆనందానికి, నవ్వులకు, సజ్జనత్వానికి, సద్గుణ సంపత్తికి నిదర్శనంగా భావిస్తారు. మహిళలంతా ఆశ్వీయుజ బహుళ చతుర్దశి నుంచి కార్తీక మాసమంతా సంధ్యా సమయంలో దీపాలను వెలిగిస్తారు. చివరకు ఈ దీపాలను ముత్తయి దువులు కార్తీక పౌర్ణమికి సముద్ర స్నానాలను ఆచరించి జీవనదులలో వదులుతారు. ఇవి సౌభాగ్యానికి, సౌశీల్యానికి, సౌజన్యానికి ప్రతీకలుగా భావిస్తారు. మనోనిశ్చలతకు, సుఖశాంతులకు అనువైన కాలమిది. దీపాలపండుగ అయిన దీపావళి రోజున మహాలక్ష్మీ పూజను జరుపుకోవడానికి ఓ విశిష్టత ఉంది. త్రికరణ శుద్ధిగా ఆరాధించే భక్తులకు వారి అభీష్టాలకు అనుగుణంగా మహర్షులకు మోక్షలక్ష్మీగా, విజయాన్ని కోరేవారికి విజయలక్ష్మీగా, విద్యార్థులకు విద్యాలక్ష్మీగా, ఐశ్వర్యాన్ని కోరి ఆరాధించేవారికి ధనలక్ష్మీగా, భక్తుల సమస్త కోరికలు నెరవేర్చే వరలక్ష్మీదేవిగా ప్రసన్నురాలౌతానని" సమాధానమిచ్చింది. అందుచేత దీపావళి రోజున మహాలక్ష్మిని పూజించేవారికి సర్వసంపదలు చేకూరుతాయని విశ్వాసం.

స్త్రీలు అభ్యంగన స్నానానంతరం కొత్త బట్టలు కట్టుకుని ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులు తీర్చి గుమ్మాలకు పసుపు, కుంకుమలు రాసి మామిడాకు తోరణాలు కట్టి సాయంత్రం లక్ష్మీపూజకు సన్నాహాలు చేసుకొంటారు. రకరకాలైన రుచికరమైన భక్ష్యభోగ్యాలతో నైవేద్యానికి పిండివంటలు సిద్ధం చేయడం, మట్టి ప్రమిదలలో నువ్వుల నూనె పోసి పూజాగృహంలో, ఇంటి బయట దీప తోరణాలు అమర్చడంతో ఆ రోజంతా ఎక్కడలేని హడావుడి, ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తాంటాయి.

**ఈ ఏడాది రెండు గంటలపాటు రాత్రి 8నుంచి 10 గంటలవరకు మాత్రమే టపాసులు కాల్చాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు వృద్ధులు, గర్భిణిలు, పిల్లలు, పెంపుడు జంతువులకు ఇబ్బంది కలగకుండా పర్యావరణ హితంగా పండుగ జరుపుకోవడం మనందరి బాధ్యత...**

**సత్యం-శివం-సుందరం**

పంచభూతాలలో ప్రధానమైనది అగ్ని. ఈ అగ్ని ప్రాణికోటి మనుగడకు ఉపకరించే తేజస్సును, ఆహారాన్ని ఐహికంగాను, విజ్ఞాన



ధర్మగరిమను ఆధ్యాత్మికంగాను ప్రసాదిస్తుంది. ఈ దీపాల వెలిగింపు ద్వారా మూడు రంగులు ప్రధానంగా మనకు గోచరమవుతాయి. నీలము, పసుపు, తెలుపు- ఈ మూడు రంగులు మానవ మనుగడకు అవశ్యకమైన సత్త్వరజస్తమోగుణాల సమ్మేళనంగా పెద్దలు చెబుతుంటారు. ఈ మూడు రంగులను జగతిని పాలించే లక్ష్మి, సరస్వతి, దుర్గలుగా భావిస్తారు పౌరాణికులు. అంతేకాక సత్యం-శివం-సుందరం - అవి దీప ప్రజ్వలన ద్వారా త్రిజగన్మాతలను ఆరాధించినట్లును, మానవులకు విజ్ఞానం, వివేకం, వినయాలకు సంకేతమని భారతీయుల విశ్వాసం. సాయంత్రం ప్రదోష సమయంలో దీపాలు వెలిగించి, ముందుగా పిల్లలు దక్షిణ దిశగా నిలబడి దీపం వెలిగించడాన్ని ఉల్కాదానం అంటారు. తరువాత కాళ్ళ కడుక్కుని ఇంటిలోపలకు వచ్చి తీపి పదార్థం తింటారు. అటు తరువాత పూజాగృహంలో నువ్వులనూనెతో ప్రమిదలు వెలిగించి దీపలక్ష్మికి నమస్కరించి కలశంపై లక్ష్మీదేవిని అవాహన చేసి విధివిధానంగా పూజిస్తారు.

- ఖాన్

## ఏపీపీఎస్సీ సభ్యుడిగా షేక్ సలాంబాబు

**రాజధాని వార్తలు, కడప :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిగా సీకె దిన్నె మండలం, సీఎంఆర్ పల్లెకు చెందిన షేక్ సలాంబాబు నియమితులయ్యారు. జీవో 127 ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. సలాంబాబు




వైఎస్ఆర్ స్టూడెంట్ యూనియన్‌కు రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తూ టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా సలాంబాబు మాట్లాడుతూ తనపై నమ్మకముంచి ఏపీపీఎస్సీ సభ్యుడిగా నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## నిరుపేదలకు ఇళ్ల కొరకు కసరత్తు



**రాజధాని వార్తలు, మంగళగిరి :** ఇటీవల మంగళగిరి మునిపల్ కమిషనర్ హేమ మాలిని నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇళ్ల గురించి స్థానికులకు వివరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మంగళగిరి పట్టణంలో ఇల్లు లేని వారు అందరూ త్వరగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న దాదాపు 1728 మందికి సంబంధించిన అర్హులను కూడా కలిపి కొత్తగా వచ్చిన దరఖాస్తులు పరిశీలిస్తామన్నారు. వార్డు వాలంటీర్ల ద్వారా ఇంటింటికి సర్వే నిర్వహించి సదరు లబ్ధిదారుల జాబితాను స్వీకరిస్తున్నామన్నారు. ప్రజల కొరకు మరోసారి వార్డులలో ఈ విషయమై వార్డు వాలంటీర్ల ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు. అపోహలు నమ్మవద్దని, ఏదైనా సమస్య ఉంటే మునిసిపల్ ఆఫీసుకు తెలియజేయమన్నారు. ప్రభుత్వ ఆదేశాలను తప్పకుండా పాటించి ఇల్లు లేని వారికి న్యాయం చేస్తామన్నారు. కావున ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకములో డి.డి.లు చెల్లించిన వారు ఎట్టి ఆపోహలకు గురికావద్దని తప్పుడు ప్రచారములను నమ్మవద్దని పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేయడమైనది. మంగళగిరిలో దాదాపు 7000ల లబ్ధిదారులు ఉండవచ్చుంని ఆమె తెలిపారు.

## కృష్ణమ్మ పరవళ్ళు



**రాజధాని వార్తలు, విజయవాడ :** ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. బ్యారేజ్ వద్ద ప్రస్తుతం ఇన్‌ఫ్లో 6లక్షల క్యూసెక్కులు కాగా.. 4.8లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కృష్ణా నదీ పరీవాహక ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా విపత్తుల నిర్వహణ శాఖ కమీషనర్ సూచించారు.

## మైనార్టీ మంత్రిని కలిసిన ఆయుబ్ ఖాన్ బృందం



**రాజధాని వార్తలు, విజయవాడ :** మైనార్టీ మంత్రివర్యులు డిప్యూటీ సీఎం అంజాద్ బాషా ను కలిసి మైనార్టీ సమస్యలను తెలిపిన మచిలీపట్నం పార్లమెంట్ కన్వీనర్ అయూబ్ ఖాన్, ముస్లిం రైట్స్ అండ్ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ నూరుద్దీన్, గౌరవ సలహాదారుడు షేక్ ఇంతియాజ్ (న్యాయవాది) జనరల్ సెక్రెటరీ మొహమ్మద్ ఇంతియాజ్ అలీ, అంజద్ బేగ్. ఆయన సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్క సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## వైఎస్ భారతిని కలిసిన నమ్రత



**రాజధాని వార్తలు, అమరావతి :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి వైఎస్ భారతీరెడ్డితో సినీ హీరో మహేశ్ బాబు భార్య నమ్రత శిరోద్కర్ సమావేశమయ్యారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం భారతీరెడ్డిని ఆమె కలిశారు. ఈ సమావేశంలో హీరో మహేశ్ బాబు బుర్రిపాలెం గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయడంపై చర్చకు వచ్చిందని సమాచారం.

'రాజధాని వార్తలు' పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
94406 62699
76809 94755
rajadhanivartalu1@gmail.com



**రాజధాని వార్తలు, మంగళగిరి : ఇటీవల ఎన్ఆర్ఐ హాస్పటల్స్ అధ్యక్షుడు ఉపేంద్రనాథ్ నిమ్మగడ్డ స్థానిక ఆమోదిని ఆశ్రమంలోని బాలలకు అవసరమయ్యే రోజు వారి వస్తువులను బహుకరించారు.**



రాజధాని వార్తలు, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యయభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు నర్సింగ్ కాలేజీలలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడంతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు యునైటెడ్ కింగ్ డమ్(యుకె)కి చెందిన నేషనల్ హెల్త్ సిస్టమ్స్, హెల్త్ ఎడ్యుకేషన్ సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నారు.



రాజధాని వార్తలు, విజయవాడ : బివోబి- బిజినెస్ ఓవర్ బేక్‌ఫాస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో తమ వాణిజ్య, వ్యాపారాల గురించి సభ్యులు మాట్లాడుకున్న దృశ్యం. ఈ సమావేశంలో అమిత్ జిందల్, కార్యవర్గ సభ్యులు, క్లబ్ మెంబర్‌లు కలిసి తమకున్న వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునే ప్రయత్నం చేశారు.



రాజధాని వార్తలు, అమరావతి : ఇతర దేశాల్లో ప్రమాదవశాత్తు చనిపోయిన (ఆంధ్రప్రదేశ్ కు చెందిన)వారి కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సంబంధిత కుటుంబానికి 50,000 రూపాయల ఎక్స్ గ్రేషియా ను ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ ప్రెసిడెంట్ శ్రీ వెంకట్ మేడపాటి లబ్ధిదారులకు చెక్కులను అందచేశారు.



## రాజధాని క్లాసిఫైడ్స్

రాయపూడి
చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంక్
ఫోన్ : 08645-244266

మందడం
ఎస్.ఆర్.కె.గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

మందడం
హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్
ఫోన్ : 8008685824

మల్కాపురం
స్వాగత్ మెస్ ప్యూర్‌వెజ్
ఫోన్ :90329 58580

చినకాకాని
ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ & జనరల్ హాస్పిటల్
ఫోన్ : 08645-230101

ఐనవోలు
విఐటి యూనివర్సిటీ
ఫోన్ : 0863 2370444

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ
ఫోన్ : 0863 2343000

మంగళగిరి
శ్రీ పూజిత హెయిర్ అండ్ బ్యూటీ
ఫోన్ : 799301511

మంగళగిరి
శ్రీదుర్గా డిజైనర్స్ (లేడీస్ టైలర్స్)
ఫోన్ : 9959308664

నూతక్కి
కొత్తపల్లి రామయ్య చారిటబుల్ ట్రస్ట్
నూతక్కి, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా,
సెల్ : 9182155644

మంగళగిరి,
అరుణోదయ హెచ్.పి. గ్యాస్‌ఏజన్సీ హుస్సేన్ కట్ట వద్ద, 9848111905

విజయవాడ
నవీన డెంటల్ & ఇంప్లాంట్ కేర్
ఫోన్ : 7893187172

విజయవాడ
న్యూఫేస్ క్లీనిక్
డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

**సాగర్ బోర్ వెల్స్**
సరసమైన ధరలకు మీరు మేచ్చే విధంగా మీ నీటి అవసరాలను తీచ్చేందుకు 4 3/4, 6 1/2, రొటరీ, రిగ్గ్ బోర్లు వేయబడును
ప్రొ॥ మల్లవరపు రమేష్ బాబు
మంగళగిరి
7981075683, 9652246869

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్ : 0866-2475087

విజయవాడ
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

విజయవాడ
ఆంధ్ర హస్పటల్,
డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

గుంటూరు
న్యూసిటి లింబ్ సెంటర్
ఫోన్ : 9951066705

విజయవాడ
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం లిమిటెడ్
ఫోన్ : 0866-2452129

విజయవాడ
స్టార్స్ ఆటోమొబైల్స్
ఫోన్ : 9848518117

రాయపూడి
2 బెడ్ రూం అపార్‌మెంట్ అద్దెకు కలదు. కార్ పార్కింగ్ ఉంది.
ఫోన్ :9440662699

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ఈ ప్రకటనల లావాదేవిలతో వార్తా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.
- మేనేజర్

ప్రకటనలకు సంప్రదించండి
9440662699




పోలీస్ కమెమోరేషన్ వీక్ సందర్భంగా రక్తదానం చేస్తున్న గణపతి అద్దెపల్లితో సంభాషిస్తున్న డిజిపి గౌతం సవాంగ్





## నేషనల్ ఇండస్ట్రీ - ఎస్ఆర్ఎం సమ్మిట్

● సీఐఐ భాగస్వామ్యంతో సదస్సు నిర్వహణ



**రాజధాని వార్తలు అమరావతి :** వచ్చే ఫిబ్రవరిలో సీఐఐ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ భాగస్వామ్యంతో 'నేషనల్ ఇండస్ట్రీ అకడమియా సమ్మిట్'ను నిర్వహించేందుకు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నిర్ణయించింది. ప్రొ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. నారాయణరావు అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎస్ఆర్ఎం వేదికగా ఫిబ్రవరి మూడో వారంలో నిర్వహించేందుకు సీఐఐ డైరెక్టర్ సమీర్‌యుద్దీన్ అంగీకరించారు. ఏపీ, తమిళనాడు, కేరళ,కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వివిధ యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులతో పాటు ఐదు రాష్ట్రాల్లోనూ పేరున్న పారిశ్రామికవేత్తలు, సీఐఐ సభ్యులు సమ్మిట్‌కు హాజరు కానున్నారని ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నారాయణరావు తెలిపారు. భారీ మధ్యతరహా పరిశ్రమల స్థాపన, అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడం వంటి కీలక అంశాలపై సదస్సులో నిపుణులు చర్చించనున్నారని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణరావు ఎస్ఆర్ఎం ప్రగతి పరిశోధనలను వివరిస్తూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ శివకుమార్, ప్రొఫెసర్లు డాక్టర్ అనిల్‌కుమార్ సురేశ్, డాక్టర్ రంజిత్ తాపా, డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు.



**రాజధాని వార్తలు, అమరావతి :** ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా. అనిల్ కుమార్ సురేష్‌కు ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మశీ (ఏబిఏపి) జాతీయ అవార్డ్ లభించింది. నానో సైన్స్‌తో పాటు కేన్సర్‌పై పరిశోధనలు చేస్తున్న పత్రాలను పరిశీలించిన తరువాత 2019 సంవత్సరానికి గాను ఏబిఏపి ఈ అవార్డ్‌కు ఎంపిక చేశారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 94406 62699, Email : rajadhanivartalu1@gmail.com